# మణికంఠది ప్రమాదమా? హత్యా?

- లోహిత్ కేసులో ప్రత్యక్షసాక్షి అనుమానాస్పద మృతి
- కరెంట్ షాక్‌తో చనిపోయాడని చెప్తున్న ఆశ్రమ సిబ్బంది
- సెలవులిచ్చినా మణికంఠను ఇంటికి ఎందుకు పంపలేదు?
- శ్రీ వేదభారతి పీఠం ఆశ్రమంపై ఆరోపణలు, విమర్శలు వెల్లువ


మణికంఠ మృతి చెందిన పుష్కరఘాట్ ప్రాంతం


బాసరలో వివాదాస్పదమవుతున్న శ్రీవేదపీఠం పాఠశాల

ప్రత్యేక ప్రతినిధి, నమస్తే తెలంగాణ: బాసరలోని శ్రీవేదభారతీపీఠం పాఠశాలలో తీవ్రగాయాల పాలైన విద్యార్థి లోహిత్ కేసులో కీలక సాక్షి అయిన సహచర విద్యార్థి మణికంఠ మరణం మిస్టరీగా మారింది. లోహిత్ నెత్తుటి మడుగులో కొనఊపిరితో కొట్టుమిట్టాడుతుండగా ముందుగా చూసింది మణికంఠ... లోహిత్‌కు అత్యంత సన్నిహితుడు. లోహిత్ తీవ్రగాయాల కేసులో మణికంఠకు కూడా కీలక సమాచారం తెలిసి ఉంటుందని పోలీసు అధికారులు భావించారు. మార్చి 20న తెల్లవారుజామున లోహిత్‌ను నెత్తుటి మడుగులో చూసిన మణికంఠ.. ఏప్రిల్ 4న తెల్లవారుజామున మృతిచెందాడు. మణికంఠ కరెంట్ షాక్‌తో చనిపోయాడని శ్రీవేదభారతి పీఠం పాఠశాల నిర్వాహకులు చెప్తున్నారు. కానీ, మణికంఠది ముమ్మాటికీ హత్యేనని అతడి కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు.

### మణికంఠను ఎందుకు ఆపారు?

లోహిత్ దవాఖానలో చికిత్స పొందుతుండగా కేసు నమోదు చేసిన పోలీసులు ఆశ్రమానికి వెళ్లి నిర్వాహకులను, సిబ్బందిని, విద్యార్థులను విచారించారు. సాక్షులుగా ఉన్న మణికంఠ, మరో విద్యార్థి ఫోన్‌లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఆ తర్వాత వేద పాఠశాల నిర్వాహకులు విద్యార్థులకు సెలవులు ఇచ్చి ఇండ్లకు పంపించారు. లోహిత్ ఘటన జరిగిన మూడు రోజులకు మణికంఠ తన తల్లిదండ్రులకు వేరే ఫోన్ నుంచి కాల్ చేసి మాట్లాడాడు. ''వేద పాఠశాలలో ఓ విద్యార్థిపై దాడి జరిగింది. పిల్లలందరినీ ఇంటికి పంపించారు. నేను కూడా ఇంటికి వెళ్తానని చెప్పాను. నువ్వు ఎక్కడికీ పోవద్దు అని స్వామీజీ ఆపారు. నా సెల్‌ఫోన్‌ను పోలీసులు తీసుకున్నారు. ఫోన్ నా చేతికి వచ్చిన తర్వాత నేను ఇంటికి వస్తాను' అని చెప్పాడని మణికంఠ తల్లిదండ్రులు తెలిపారు. "ఫోన్ లేకపోయినా పర్లేదు, నువ్వు ఇంటికిరా. అక్కడ పరిస్థితి బాగోలేదు" అని మణికంఠ తల్లిదండ్రులు చెప్పగా, "అలాంటి విలువైన ఫోన్ మనం మళ్లీ కొనలేం. ఫోన్‌ను పోలీసులు నాకు ఇచ్చిన తర్వాత ఇంటికి వస్తాను" అని మణికంఠ చెప్పాడని తల్లిదండ్రులు వెల్లడించారు.

### మీ కుమారుడు చనిపోయాడు!

ఏప్రిల్ 4న మధ్యాహ్నం 12 గంటలకు పాఠశాల నిర్వాహకులు మణికంఠ తల్లిదండ్రులకు ఫోన్‌చేసి, "మీ కుమారుడు మనికంఠ చనిపోయాడు" అని చెప్పారు. "విద్యార్థులందరికీ సెలవులు ఇచ్చి, తమ కుమారుడు ఒక్కడినే పాఠశాలలోనే ఉండాలంటూ స్వామీజీ ఆపడమేంటి? హఠాత్తుగా తమ కుమారుడు చనిపోవడమేంటి? దీని వెనుక ఏదో మతలబు ఉంది" అని మణికంఠ తల్లిదండ్రులు అనుమానం వ్యక్తంచేస్తున్నారు. మణికంఠను స్వామీజీ ఆపడం వెనుక ఏదో ఆంతర్యం, కుట్ర దాగి ఉన్నాయని బాసరలోని స్థానికులు అనుమానం వ్యక్తంచేస్తున్నారు.

### నీళ్లలోకి నువ్వే దిగాలి.. వేరే ఎవరూలేరు

ఏప్రిల్ 3న మణికంఠ పుట్టిన రోజు. ఆ మరుసటి రోజు తెల్లవారుజామున మణికంఠ పాఠశాల నుంచి బయటికి వచ్చాడు. టూవీలర్‌లో పెట్రోల్ నింపుకున్నాడు. ఆ తర్వాత పాఠశాలలో పనిచేసే మాతాజీ తండ్రి.. మణికంఠను పుష్కరఘాట్‌కు రమ్మని పిలిచాడు. దీంతో మణికంఠ పుష్కరఘాట్‌కు వెళ్లాడు. ఆ సమయంలో అక్కడే ఉన్న కొందరు స్థానికులు చెప్తున్న ప్రకారం ఘాట్ మొత్తం నీటితో శుభ్రం చేయాలని మణికంఠకు మాతాజీ తండ్రి సూచించాడని తెలిసింది. పాఠశాలకు చెందిన మోటర్‌కు నీళ్లు అందడం లేదని, మోటర్‌ను కాస్త నీళ్లలోపలికి నెట్టి.. వైర్ కనెక్షన్ ఇవ్వాలని చెప్పినట్టు సమాచారం. తనకు ఆ పని తెలియదని, నీళ్లలోకి దిగబోనంటూ మణికంఠ నిరాకరించాడని, అయినా కూడా "నువ్వే చేయాలి, వేరే ఎవరూ లేరు" అంటూ మణికంఠను బలవంతంగా మోటర్ దగ్గరికి పంపినట్టు స్థానికులు చెప్తున్నారు. నీళ్లలోని మోటర్ దగ్గరికి వెళ్లి, వైర్ సరిచేస్తున్న సమయంలో మణికంఠకు కరెంట్ షాక్ తగిలి అక్కడికక్కడే చనిపోయాడు. జరిగిన మొత్తం పరిణామాలు చూస్తుంటే ఇదంతా పక్కా ప్లాన్ ప్రకారం చేసినట్టుగా కనబడుతున్నదని, కానీ పోలీసులు మాత్రం నిర్లక్ష్యం కారణంగా కరెంట్ షాక్‌తో మరణించినట్టు కేసు నమోదుచేశారని మణికంఠ బంధువులు మండిపడుతున్నారు.

### ముగ్గురు సాక్షులు ఎవరు?

మణికంఠ గోదావరిలోకి వెళ్లడం, వైర్ కనెక్షన్ ఇస్తుండగా కరెంట్ షాక్‌తో మృతి చెందడాన్ని ముగ్గురు అమ్మాయిలు చూశారని ఆశ్రమ నిర్వాహకులు చెప్తున్నారు. ఆ ముగ్గురిది నిజామాబాద్ అని పోలీసులకు తెలిపారు. కానీ ముగ్గురు అమ్మాయిలు ఉదయం 4 గంటల సమయంలో పుష్కరఘాట్ వద్ద ఎందుకు ఉన్నారు? అని స్థానికులు అనుమానాలు వ్యక్తంచేస్తున్నారు.

### ప్రాణం వెల కట్టేందుకు ప్రయత్నం

మణికంఠ కుటుంబసభ్యులతో గుట్టుచప్పుడు కాకుండా సెటిల్‌మెంట్ కోసం శ్రీవేదభారతీ పీఠం పాఠశాల నిర్వాహకులు ప్రయత్నించడం విమర్శలకు తావిస్తున్నది. మణికంఠ మృతి చెందిన విషయం తెలియగానే అదేరోజు రాత్రి 9.30 గంటలకు అతని బంధువులు బాసర దవాఖానకు చేరుకున్నారు. రాత్రి 11.30 గంటలకు మృతుడి తల్లిదండ్రులు బాసర చేరుకున్నారు. "నా కొడుకును చదువుకోడానికి పంపిస్తే పనులు చేయిస్తారా? మోటర్ పని మావాడికి ఎలా వస్తుంది? ఇది పాఠశాల నిర్వహకుల నిర్లక్ష్యమే" అంటూ మండిపడ్డారు. ఎఫ్ఐఆర్‌లోనూ ఆ విషయాన్ని ప్రస్తావించారు. ఉదయం డెడ్‌బాడీతో బాసరలో ధర్నా చేసేందుకు సిద్ధమయ్యా రు. విషయాన్ని పసిగట్టిన పాఠశాల నిర్వహకులు బాసరలో ఓ వర్గం నేతల సహకారంతో ఆందోళనకు ఆటంకం సృష్టించారు. పోలీసులు సైతం మణికంఠ మృతదేహాన్ని పోస్ట్‌మార్టం కోసం భైంసాకు తీసుకువెళ్లాలని, ఏమైనా ఉంటే అక్కడ మాట్లాడుకుందామని చెప్పారు. బాధితుడి కుటుంబసభ్యులు, బంధువులను భైంసాకు తీసుకెళ్లారు. అక్కడ స్వామిజీ శిష్యు లు, పోలీసులు కలిసి మణికంఠ కుటుంబ సభ్యులకు కౌన్సెలింగ్ ఇచ్చినట్టు తెలిసింది. కొన్ని రోజులయ్యాక వస్తే మాట్లాడుతామని నచ్చజెప్పి అక్కడి నుంచి పంపించేశారు.

బాసరలో నెత్తుటి ఘోష!

### లోహిత్, మణికంఠకు ఏం తెలుసు?

శ్రీవేదభారతీ పీఠం నిర్వాహకుల ఆగడాలకు అదుపులేకుండా పోయిందని స్థానికులు విమర్శిస్తున్నారు. ఆశ్రమంలో జరుగుతున్న విషయాలు విద్యార్థి లోహిత్‌కు తెలిసిఉంటాయని, అందుకే అతడిని అంతమొందించేందుకే దాడి చేసి ఉంటారని కొందరు అనుమానిస్తున్నారు. లోహిత్‌కు తెలిసిన విషయాలే మణికంఠకు తెలిసి ఉంటాయని, అందుకే అతడిని మట్టుబెట్టారని కొందరు ఆరోపిస్తున్నారు.

### గుట్టుచప్పుడు కాకుండా సెటిల్మెంట్

స్వామీజీకి సన్నిహితులైన కొందరు మణికంఠ కుటుంబసభ్యులను బాసరకు పిలిపించి, వారితో ఓ లాడ్జిలో రహస్యంగా సమావేశమయ్యారు. బాసరలో ఉంటే ఎవరికైనా తెలిసే ప్రమాదముందని చెప్పి, భైంసాకు తీసుకెళ్లి సెటిల్‌మెంట్ కోసం మాట్లాడారు. కమిటీ చెప్పిన దానికి కుటుంబసభ్యులు అంగీకరించకపోవడంతో మరో సిట్టింగ్‌లో మాట్లాడుకుందామని చెప్పినట్టు తెలిసింది. దీనిపై బాధిత కుటుంబసభ్యులతో మాట్లాడే ప్రయత్నం చేయగా కాళేశ్వరంలో ఉన్నామని, తర్వాత మాట్లాడుతామని తెలిపారు. తిరిగి ఎన్ని సార్లు ఫోన్ చేసినా స్పందించలేదు. ఇలా బాసరలోని శ్రీవేదభారతీ పీఠం పాఠశాలకు చెందిన ఓ విద్యార్థికి ప్రాణాపాయం కలిగేంతగా గాయాలు కావడం, మరో విద్యార్థి మృతి చెందడం మిస్టరీగా మారింది.

**రేపటి సంచికలో..**

**"చావుకేకలు వినిపించట్లేదా?"**

## స్వామిజీపైనే అనుమానం

మొదటిపేజీ తరువాయి...

చిత్రీకరిస్తున్నారని ఆరోపించారు. మణికంఠ మృతి తర్వాత న్యాయం కోసం ఎవరిని అడగాలో తెలియడం లేదని వాపోయారు. మణికంఠ మృతిపై 'నమస్తే తెలంగాణ ప్రతినిధి'తో మాట్లాడుతూ "మణికంఠ మా పెద్ద కొడుకు. 2024 జనవరి 9న వేద పాఠశాలలో చేర్పించాం. ఇటీవల అక్కడ ఏదేదో జరుగుతున్నట్టుగా చెప్పిండు. ఏప్రిల్ 3న మణికంఠ పుట్టినరోజు. ఆ రోజు రాత్రి స్వామికి ఫోన్ చేసిన. వచ్చి సంతకం పెట్టి మీ కొడుకును తీసుకుపోండి అని ఫోన్ పెట్టేసిండు. మా అబ్బాయికి ఫోన్ ఇచ్చిన తర్వాత వేరే అనిపించింది. నేను వస్తానని అనలేదు కదా డాడీ, ఎవరు నీకు అలా చెప్పిండ్రు అని అన్నడు. 3వ తేదీ రాత్రి ఫోన్ చేస్తే గంటసేపు మేమందరం మాట్లాడినం. బాసరకు రావద్దు డాడీ.. రూ.2 వేలు ఖర్చు వస్తది అన్నడు. పుట్టిన రోజుకు ముందుగానే ఆన్‌లైన్‌లో బట్టలు బుక్ చేసుకున్నడు. ఏప్రిల్ 4న పొద్దున 10.45 గంటలకు మాకు ఫోన్ వచ్చింది. నీళ్ల ప్లాంట్ అతను ఫోన్ చేసి మీ అబ్బాయి కరెంట్ షాక్‌తో చనిపోయిండని చెప్పిండు. ముందుగా నేను నమ్మలేదు. లేదు సార్ నిజమే చనిపోయిండని అన్నడు. 3వ తేదీన పుట్టిన రోజుకు 20 సంవత్సరాలు పడ్డయి. కరెంట్ షాక్ కొట్టిందంటే బండి పట్టుకుని బాసరకు వెళ్లాం. బాసరలో మేం ఎక్కడికి పోతే అక్కడికి కొందరు వచ్చి చూసిన్రు. వాళ్ల అమ్మానాన్న వచ్చిండ్రా? ఎంతమంది వచ్చిండ్రు? అని హోటల్ వాళ్లకు ఫోన్ చేసి అడిగిన్రు. కరెంట్ షాక్ అని స్వామి చెప్పిండు. పోలీసులు పట్టించుకుంటలేరు. మాకు స్వామిజీ మీదనే అనుమానముంది" అని వివరించారు.

### షాక్ కొట్టిందని నాటకం ఆడుతున్నరు

"మేం పేదోళ్లం. మా కొడుకు మంచిగా చదువు నేర్చుకుని వచ్చి, మాకు సహాయపడి, మమ్మల్ని సాదుతాడనుకున్నం. మా 20 ఏండ్ల కొడుకు, మా ఎత్తు కొడుకు చనిపోతే మేం ఎట్ల బతుకుతం. మా బాబు ఏం చేసిండని ఇలా చేసిండ్రు?. మా కొడుకు పాణం తీసిండ్రు. కరెంట్ షాక్ కొట్టిందని నాటకం ఆడుతున్నరు. వాళ్లే చేసిండ్రు అంతా"

– కవిత, మణికంఠ తల్లి

## వేదం ముసుగులో వ్యాపారం

- గోదావరి హారతి, బీజాక్షరం పేరిట అక్రమ వసూళ్లు
- వేదభారతి విద్యానందగిరిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్
- వరుస ఘటనల్లో సమగ్ర విచారణకు ఆదేశమివ్వండి
- నిర్మల్ కలెక్టర్, ఎస్పీకి బాసర గ్రామస్థుల విజ్ఞప్తి


నిర్మల్ ఎస్పీ డాక్టర్ జానకీ షర్మిలను కలిసి భారతి విద్యానందగిరి స్వామి అక్రమాలపై విచారణ జరిపించాలని కోరుతున్న బాసర గ్రామస్థులు

నిర్మల్, మే 5 (నమస్తే తెలంగాణ): శ్రీవేదభారతీ పీఠం నిర్వాహకుడు విద్యానందగిరి స్వామి.. వేదం ముసుగులో వ్యాపారం చేస్తున్నాడని బాసర గ్రామస్థులు ఆరోపించారు. గోదావరి హారతి, బీజాక్షరం పేరిట వసూళ్ల దందా చేస్తున్నాడని మండిపడ్డారు. ఈ మేరకు సోమవారం నిర్మల్ జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్, ఎస్పీ జానకీ షర్మిలను కలిసి వినతి పత్రాలు అందజేశారు. గోదావరి హారతి పేరిట ఘాట్ స్థలాన్ని కబ్జా చేశారని తెలిపారు. ఇటీవల వేద పాఠశాలలో విద్యార్థి లోహిత్‌పై దాడి జరిగినా, ఘటన ఎలా జరిగింది? ఎందుకు జరిగింది? కారకులు ఎవరు? అనే వాస్తవాలు బయటకురాలేదని చెప్పారు. లోహిత్‌కు సన్నిహితుడైన మణికంఠ అనే విద్యార్థి అనుమానాస్పదంగా చనిపోవడం పలు అనుమానాలు కలిగిస్తున్నదని తెలిపారు. లోహిత్ కేసులో సాక్షిగా ఉన్న మణికంఠను పక్కా ప్లాన్‌తోనే హత్య చేశారని వినతి పత్రంలోనే పేర్కొన్నారు. ఈ వ్యవహారంలో సమగ్ర విచారణ జరిపించాలని కోరారు. ఇన్ని జరుగుతున్నా విద్యానందగిరిపై పోలీసులు చర్యలు తీసుకోవడంలేదని వాపోయారు. స్వామితోపాటు ఆయన అనుచరులపై పూర్తి స్థాయి విచారణ చేసి, తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. బాసర గ్రామస్థుల విజ్ఞప్తిపై కలెక్టర్ అభిలాష అభినవ్ సానుకూలంగా స్పందించారు. స్వామీ కార్యకలాపాలపై విచారణ చేయాలంటూ ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు వచ్చాయని తెలిపారు. త్వరలోనే పూర్తి విచారణ జరిపి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. అలాగే ఎస్పీ జానకీ షర్మిల మాట్లాడుతూ.. విద్యానందగిరిపై ఇప్పటికే విచారణ కొనసాగుతున్నదని తెలిపారు. కొన్ని కీలకమైన ఆధారాల సేకరణలో ఉన్నామని, త్వరలోనే అన్ని విషయాలు బయటకు వస్తాయని చెప్పారు. గ్రామస్థులు సహకరించాలని కోరారు.


గవర్నర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఈబీసీ సంక్షేమ సంఘం నాయకులు

## ఈబీసీ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

**ఈబీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మకు వినతి**

హైదరాబాద్, మే 5 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలోని అగ్రవర్ణ పేదల అభ్యున్నతి కోసం ఈబీసీ కార్పొరేషన్ ఏర్పాటుచేయాలని ఈబీసీ సంక్షేమ సంఘం కోరింది. ఈ మేరకు సోమవారం ఈబీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు వల్లపురెడ్డి రవీందర్‌రెడ్డి నేతృత్వంలోని ప్రతినిధుల బృందం గవర్నర్ జిష్ణుదేవ్ వర్మను కలిసి వినతిపత్రం అందజేసింది. ఈ సందర్భంగా రవీందర్‌రెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రంలో అగ్రకులాల జనాభాలో 90 శాతం కుటుంబాలు పేదరికంలో మగ్గుతున్నట్టు తెలిపారు. వారి సంక్షేమం కోసం రూ.10 వేల కోట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల మాదిరిగా ఈబీసీ విద్యార్థులకు స్టడీసర్కిల్, గురుకుల పాఠశాలలు, రెసిడెన్షియల్ స్కూళ్లు ఏర్పాటుచేయాలని, స్కాలర్‌షిప్‌లు, మెస్ చార్జీలు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో జేఏసీ ప్రతినిధులు బొడ్డు రవిశంకర్‌రావు, చందు జనార్దన్, నీలగిరి దయాకర్‌రావు, గట్టు శ్రీనివాసాచార్యులు పాల్గొన్నారు.

## 'పది' మార్కులతోనే ఆర్జీయూకేటీలో సీట్లు?

- ప్రభుత్వానికి చేరిన ప్రతిపాదనలు
- సర్కారు బడుల విద్యార్థులకు నష్టం
- జీపీఏతోనే అడ్మిషన్లు ఇవ్వాలని విద్యావేత్తల డిమాండ్

హైదరాబాద్, మే 5 (నమస్తే తెలంగాణ): బాసరలోని రాజీవ్‌గాంధీ యూనివర్సిటీ ఆఫ్ నాలెడ్జ్ అండ్ టెక్నాలజీ (ఆర్జీయూకేటీ)లోని ఈ విద్యా సంవత్సరంలో పదో తరగతి మార్కుల ఆధారంగా సీట్లను భర్తీ చేయాలని విద్యాశాఖ నిర్ణయించింది. గతంలో జీపీఏ ఆధారంగా ఈ వర్సిటీలో సీట్లను భర్తీచేసేవారు. దానిస్థానంలో మార్కుల ప్రాతిపదికన ఎంపిక చేయాలన్న ప్రతిపాదనలు ఇప్పటికే సర్కారుకు చేరాయి. ఇక సర్కారు ఆమోదం లాంఛనమే కానున్నది. ఈ నెలలోనే అడ్మిషన్ల నోటిఫికేషన్‌ను వర్సిటీ అధికారులు విడుదల చేయనున్నారు. రాష్ట్రంలోనే అత్యంత ప్రతిష్ఠాత్మక విద్యాసంస్థ అయిన ఈ ఆర్జీయూకేటీలో ఆరేండ్ల ఇంటిగ్రేటెడ్ బీటెక్ కోర్సును నిర్వహిస్తున్నారు. ఈ విద్యాసంస్థలో చేరిన వారికి పూర్తి ఉచిత విద్యను అందిస్తున్నారు. గ్రామీణ నిరుపేద, ప్రతిభావంతుల కోసమే ఈ వర్సిటీని ఏర్పాటు చేశారు. అయితే మార్కుల విధానంలో అడ్మిషన్లు కల్పిస్తే సర్కారు బడుల్లోని విద్యార్థులకు నష్టం జరుగుతుందన్న ఆందోళనలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి. జీపీఏతోనే అడ్మిషన్లు కల్పించాలన్న డిమాండ్లు వినిపిస్తున్నాయి. రాష్ట్రంలో ఈసారి పదో తరగతి మెమోలపై జీపీఏతోపాటు మార్కులను కూడా ముద్రించారు. మొత్తంగా కాకుండా సబ్జెక్టుల వారీగా మొత్తం మార్కులు, సబ్జెక్టుల వారీగా జీపీఏను మాత్రమే ముద్రించారు. గతంలో జీపీఏ ఆధారంగా ఎంపిక చేసేవారు. సర్కారు బడుల్లో చదివిన వారికి అదనంగా నాలుగు పాయింట్లు కలపడంతో కలిసొచ్చేది. దీంతో అధిక సీట్లను సర్కారు బడుల విద్యార్థులే దక్కించుకునేవారు. గ్రేడింగ్‌లో కాకుండా మార్కుల విధానంలో సీట్లను భర్తీ చేస్తే ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులే అధిక సీట్లను దక్కించుకునే అవకాశం ఉన్నదన్న వాదనలు వినిపిస్తున్నాయి. మెమోలపై గ్రేడింగ్ ఉన్నా, మార్కులను భర్తీచేయడం ఏమిటన్న ప్రశ్నలు వస్తున్నాయి. మార్కులు కాకుండా గ్రేడింగ్‌ను పరిగణనలోకి తీసుకోవాలన్న డిమాండ్లు వినిపిస్తున్నాయి.

### నష్టం జరిగేది ఇలా!

గ్రేడింగ్ విధానంలో ఒక సబ్జెక్టులో 92 నుంచి 100 మార్కులు వచ్చిన వారికి 10 గ్రేడ్ పాయింట్లు ఇస్తున్నారు. అంటే 92 మార్కులొచ్చినా, 100 మార్కులొచ్చినా 10 జీపీఏ కిందే పరిగణించేవారు. సర్కారు స్కూళ్లలో చదివిన విద్యార్థులకు పదో తరగతిలో వచ్చిన మార్కులతోపాటు అదనంగా 0.4 పాయింట్లు కలిపేవారు. ఇప్పుడు మార్కుల విధానంలో 92 మార్కులొచ్చిన వారికి అదనపు మార్కులు కలిపితే 96 మార్కులే వస్తాయి. అదే ప్రైవేట్‌లో 98, 99, 100 మార్కులొచ్చిన వారు అధికంగా ఉంటారు. కనుక వారే సీట్లను ఎగరేసుకుపోవడం ఖాయంగా కనిపిస్తున్నది.

# తప్పుదోవ పట్టించేందుకే తప్పుడు ప్రచారం

- బీఆర్ఎస్ పార్టీ ముఖ్య నేతలే లక్ష్యంగా కాంగ్రెస్ వ్యవహారం
- సోషల్ మీడియా వేదికగా విషం చిమ్ముతున్న కాంగ్రెస్
- కాంగ్రెస్ పెద్దల కనుసన్నల్లోనే ఫేక్ క్లిప్పింగ్‌లు పోస్టులు
- చోద్యం చూస్తున్న సైబర్‌క్రైమ్.. భగ్గుమంటున్న బీఆర్ఎస్

హైదరాబాద్, మే 5 (నమస్తే తెలంగాణ): ప్రజలకిచ్చిన హామీల అమలు చేయలేక, ఉద్యోగులకిచ్చిన వాగ్దానాలు నెరవేర్చలేక ఉక్కిరిబిక్కిరవుతున్న కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు ప్రయత్నిస్తున్నదన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. తమ వైఫల్యాలను గత బీఆర్ఎస్ ప్రభుత్వంపై నెడుతూ గులాబీ పార్టీ నేతలపై దుష్ప్రచారానికి దిగుతున్నట్టు ఆరోపణలు వస్తున్నాయి. కాంగ్రెస్ పార్టీ పెద్దల కనుసన్నల్లో రెచ్చిపోతున్న 'స్పెషల్ టీం'.. మీడియా విలువలకు తిలోదకాలిస్తూ రాజకీయ లబ్ధి కోసం ప్రజల్లో గందరగోళానికి తెరలేపుతున్నదని బీఆర్ఎస్ నేతలు విమర్శిస్తున్నారు. నిత్యం ఏదో ఒక అసత్య కథనాన్ని వండివార్చి జనంలోకి వదులుతున్నారని ఆరోపిస్తున్నారు.

### బీఆర్ఎస్ సోషల్ మీడియాపై కక్ష..

ఓ వైపు సోషల్ మీడియాను అడ్డంపెట్టుకొని ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్‌పై ఫేక్ ప్రచారం చేస్తున్న కాంగ్రెస్ సర్కారు మరోవైపు ప్రజల వాణిని ప్రభుత్వానికి తెలియజేస్తున్న ఇతరుల సామాజిక మాధ్యమాలపై కక్ష సాధిస్తున్నట్టు ఆరోపణలు వస్తున్నాయి. సమస్యలపై ప్రశ్నించినా, ప్రభుత్వ వ్యతిరేక పోస్టులను స్టేటస్‌గా పెట్టుకున్నా, వాట్సాప్, ఇన్‌స్టా, ఎక్స్‌లో షేర్ చేసినా.. వారిని వెతికి, వెంటాడి మరీ కేసులు కడుతున్నట్టు తెలిసింది. పోలీసులను అడ్డంపెట్టుకొని సర్కారును నడుపుతూ.. ప్రశ్నించే వారి గొంతునొక్కుతూ 'ప్రజాపాలన'కు కొత్త అర్థం చెబుతున్నదని బీఆర్ఎస్ నేతలు విమర్శిస్తున్నారు. తరచూ విచారణ పేరిట వేధింపులకు గురిచేస్తూ.. మహిళా జర్నలిస్టులను కూడా విచక్షణ లేకుండా జైళ్లకు పంపిందని మండిపడుతున్నారు.

### కాంగ్రెస్ ఆఫీసులోనే ఫేక్ క్లిప్పింగ్‌లు

అధికార పార్టీ ఆఫీసులోనే సోషల్ మీడియా స్పెషల్ టీంలను ఏర్పాటు చేసుకొని బీఆర్ఎస్ ముఖ్యనేతలపై దుష్ప్రచారం చేస్తున్నట్టు తెలుస్తున్నది. మాజీ మంత్రి హరీశ్‌రావుపై ఫేక్ క్లిప్పింగ్స్ సృష్టించి ప్రజల్లోకి పంపుతున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. ఆయన కొత్త పార్టీని ఏర్పాటు చేస్తున్నారని, లేదంటే బీజేపీలో చేరతారని దేశంలోని ప్రముఖ చానళ్ల లోగోలు, పత్రికల మాస్ట్‌హెడ్‌లతో క్లిప్పింగ్స్ రూపొందించి జనంలోకి పంపుతున్నది. సర్కారు చేతగానితనాన్ని కప్పిపుచ్చుకొనేందుకు, బీఆర్ఎస్‌ను నేరుగా ఎదుర్కొనే ధైర్యంలేకే తప్పుడు మార్గాలను అనుసరిస్తున్నదన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

### చోద్యం చూస్తున్న సైబర్ క్రైం

ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకొస్తున్న బీఆర్ఎస్ సోషల్ మీడియా కార్యకర్తలపై విరుచుకుపడుతున్న సైబర్ క్రైం పోలీసులు కాంగ్రెస్ నాయకులను మాత్రం చూసీచూడనట్టు వదిలేస్తున్నారన్న విమర్శలు వస్తున్నాయి. బీఆర్ఎస్ నాయకులు అన్ని ఆధారాలతో ఫిర్యాదు చేసినా పోలీసులు పట్టించుకోవడం లేదని తెలిసింది. పైగా తమపైనే కేసులు పెడతామంటూ బెదిరిస్తున్నారని బీఆర్ఎస్ నాయకులు ఆరోపిస్తున్నారు. ఉస్మానియా హాస్టల్‌లో నీళ్లు రావడంలేదని, హెచ్‌సీయూ పరిసరాల్లో జింకలు మరణించాయని, హైడ్రా బాధితుల ఆర్తనాదాలు, మూసీ బాధితుల కన్నీటి బాధలపై సోషల్ మీడియాలో పోస్టులు పెట్టిన మన్నె క్రిశాంక్‌పై 28 కేసులు నమోదు చేశారు. అలాగే బీఆర్ఎస్ సోషల్ మీడియా కన్వీనర్ కొణతం దిలీప్‌పై పదుల సంఖ్యలో కేసులు పెట్టారు. విచారణ పేరిట కొన్ని నెలలపాటు జైళ్లో నిర్బంధించారు. సామాన్యుల వాణిని బలంగా వినిపించిన యూట్యూబ్ జర్నలిస్టులు రేవతి, శంకర్ తదితరులను అక్రమ కేసులు పెట్టి జైలుకు పంపించారు. కానీ తప్పుడు పోస్టులు పెట్టిన కాంగ్రెస్ నేతలను మాత్రం వెనుకేసుకొస్తున్నారు. బీఆర్ఎస్ నాయకులు ఆధారాలతో సహా గచ్చిబౌలి, బంజారాహిల్స్ ఠాణాల్లో ఫిర్యాదు చేసినా కనీసం ఎఫ్ఐఆర్ కూడా నమోదు చేయలేదు. తాజాగా హరీశ్‌రావుపై ఫేక్ క్లిప్పింగ్స్‌తో తప్పుడు వార్తలు ప్రసారం చేస్తున్న కాంగ్రెస్ నాయకులపై చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్ ఆధ్వర్యంలో నాయకులు గచ్చిబౌలి సీసీఎస్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కానీ పోలీసులు నచ్చజెప్పి పంపించారు తప్ప కేసు నమోదు చేయలేదని నాయకులు ఆరోపించారు. ఇక తమకు న్యాయస్థానాలను ఆశ్రయించడం తప్ప గత్యంతరం లేదని వారు వాపోయారు. ఇప్పటికైనా పోలీసులు చట్టబద్ధంగా నడుచుకోవాలని లేదంటే భవిష్యత్తులో తగిన బుద్ధిచెప్పాల్సి వస్తుందని హెచ్చరిస్తున్నారు.


గచ్చిబౌలి సీసీఎస్‌లో ఫిర్యాదుచేస్తున్న ఎమ్మెల్సీ దాసోజు, ఎర్రోళ్ల శ్రీనివాస్

## హరీశ్ సోషల్ మీడియా ఖాతాపై దుష్ప్రచారం

- కాంగ్రెస్ తప్పుడు ప్రచారం
- సైబర్‌క్రైమ్ పోలీసులకు ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్ ఫిర్యాదు

హైదరాబాద్ సిటీబ్యూరో, మే 5 (నమస్తే తెలంగాణ): మాజీ మంత్రి హరీశ్‌రావు సోషల్ మీడియా ఖాతా విషయమై కాంగ్రెస్ నాయకులు తప్పుడు ప్రచారం చేయడంపై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్‌కుమార్ తీవ్రంగా స్పందించారు. హరీష్‌రావు సోషల్ మీడియా అకౌంట్‌ను బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్‌ఫాలో చేశారంటూ దుష్ప్రచారం చేస్తున్న కాంగ్రెస్ సోషల్ మీడియా హ్యాండిల్స్, ఆ పార్టీ నేతలపై చర్యలు తీసుకోవాలని సైబరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులను కోరారు. ఈ మేరకు బీఆర్ఎస్ నేతలు ఎర్రోళ్ల శ్రీనివాస్, వై సతీశ్‌రెడ్డి తదితరులతో కలిసి ఎమ్మెల్సీ శ్రవణ్‌కుమార్ సోమవారం గచ్చిబౌలిలోని సైబరాబాద్ సైబర్‌క్రైమ్ ఠాణాలో ఫిర్యాదు చేశారు. అనంతరం మాట్లాడుతూ... బీఆర్ఎస్ పార్టీపై, బీఆర్ఎస్ నాయకులపై సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం చేస్తున్న కాంగ్రెస్ నాయకులకు త్వరలో గట్టిగా బుద్ధి చెబుతామని హెచ్చరించారు. బీఆర్ఎస్ రజతోత్సవ సభ కనీవినీ ఎరుగని రీతిలో విజయవంతమైందని, బీఆర్ఎస్‌కు ప్రజల్లో ఉన్న ఆదరణ చూసి కాంగ్రెస్ నాయకుల దిమ్మతిరిగిపోయిందని పేర్కొన్నారు. ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత ఏ స్థాయిలో ఉన్నదో కూడా అదే సభతో స్పష్టమైందని తెలిపారు. ఓవైపు బీఆర్ఎస్‌కు ఆదరణ పెరుగుతుండటం, మరోవైపు కాంగ్రెస్ పట్ల వ్యతిరేకత ఎక్కువ అవుతుండటం చూసి జీర్ణించుకోలేకనే కాంగ్రెస్ పార్టీ తమ నాయకులపై తప్పుడు ప్రచారాలు మొదలుపెట్టిందని మండిపడ్డారు. సీఎం రేవంత్‌రెడ్డి కనుసన్నల్లోనే ఇదంతా జరుగుతున్నదని ఆరోపించారు.

# 'కోరుకొండ'లో తెలంగాణ కోటా కట్

- మన విద్యార్థులకు ప్రవేశాలు నిలిపివేసిన అధికారులు
- ఇప్పటికే పరీక్ష రాసిన 20వేల మంది
- తెలంగాణకు సీట్లు ఇవ్వలేమని తేల్చిచెప్పిన పాఠశాల అధికారులు
- మన రాష్ట్రానికి సైనిక్ స్కూల్ ఇవ్వని కేంద్ర ప్రభుత్వం
- నష్టపోతున్న తెలంగాణ విద్యార్థులు

హైదరాబాద్, మే 5 (నమస్తే తెలంగాణ) : కోరుకొండ సైనిక్ స్కూల్‌లో చేరాలనుకునే విద్యార్థుల ఆశలపై పాఠశాల అధికారులు నీళ్లు చల్లారు. తెలంగాణకు గల హోం స్టేట్ హోదాను రద్దుచేశారు. 2025–26 విద్యాసంవత్సరంలో తెలంగాణ విద్యార్థులకు ఈ హోదాలో ప్రవేశాలు నిలిపివేశారు. ఏప్రిల్ 30న పాఠశాల ప్రిన్సిపాల్ లేఖ విడుదల చేశారు.

### ఇది వరకు 67% కోటాలో..

ఆంధ్రప్రదేశ్‌లోని విజయనగరం జిల్లా కోరుకొండలో సైనిక్ స్కూల్‌ను నిర్వహిస్తున్నారు. ఈ స్కూల్‌లో హోం స్టేట్ స్టేటస్ కింద తెలంగాణ, ఏపీ విద్యార్థులకు 67% సీట్లున్నాయి. ఈ సారి తెలంగాణ నుంచి 20వేల మంది విద్యార్థులు సైనిక్ స్కూల్ ఎంట్రెన్స్ కోసం దరఖాస్తు చేసుకున్నారు. ఏప్రిల్‌లో పరీక్ష కూడా రాశారు. రాష్ట్ర విభజన జరిగి 10 ఏండ్లు పూర్తికావడంతో తెలంగాణకు గల హోం స్టేట్ హోదాను ఉపసంహరించారు. దీంతో మన రాష్ట్ర విద్యార్థులకు తీరని నష్టం జరగనున్నది. తెలంగాణ విద్యార్థులు ఆలిండియా కోటాలో అన్ని రాష్ట్రాల విద్యార్థులతో 33శాతం కోటా సీట్లకు పోటీపడాల్సిన పరిస్థితి నెలకొన్నది. తెలంగాణలో కొత్త సైనిక్ స్కూల్ ప్రారంభించే వరకు తెలంగాణ హోం స్టేట్ హోదాను పునరుద్ధరించాలని విద్యాశాఖ కేంద్ర రక్షణ మంత్రిత్వశాఖకు లేఖ రాసింది. దీనిపై ఏపీ ప్రభుత్వం నుంచి రక్షణశాఖ రిమార్క్స్ అడిగినట్టు తెలిసింది.

### మనకేమో మొండిచెయ్యి..

సైనిక్ స్కూళ్ల మంజూరు విషయంలో రాష్ట్రానికి తీరని అన్యాయం జరుగుతున్నది. కేంద్రం మొండిచెయ్యి చూపిస్తున్నది. గతంలో ఒక సైనిక్ స్కూల్‌ను మంజూరుచేసినట్టు ప్రకటించారు. ఇది కాగితాలకే పరిమితమయ్యింది. వరంగల్ జిల్లా ధర్మాసాగర్, సికింద్రాబాద్ కంటోన్మెంట్, మహబూబ్‌నగర్ జిల్లాకు సైనిక్ స్కూళ్లు ఇవ్వాలని రాష్ట్రం నుంచి విజ్ఞప్తులు వెళ్లాయి. కరీంనగర్ జిల్లా సిరిసిల్ల, హుస్నాబాద్‌లోనూ సైనిక్ స్కూళ్లను ఏర్పాటు చేయాలని ప్రజాప్రతినిధులు కోరారు. ఫలితం లేకుండా పోయింది. ఇటీవలి కాలంలో పబ్లిక్ ప్రైవేట్ పార్ట్‌నర్‌షిప్‌లో(పీపీపీ) కొత్త సైనిక్ స్కూల్స్ ఏర్పాటుకు కేంద్రం అనుమతిస్తున్నది. పీపీపీ పద్ధతిలోనైనా స్కూల్‌ను కేటాయించలేదు. ఒకవైపు కోరుకొండ సైనిక్ స్కూల్‌లో ప్రవేశాలు లేకపోవడం, తెలంగాణలో కొత్త సైనిక్ స్కూళ్లు ఏర్పాటు కాకపోవడంతో మన రాష్ట్ర విద్యార్థులకు తీవ్ర అన్యాయం జరుగుతున్నది.

### ఏపీకి మాత్రం అడిగినన్నీ..

మన పక్క రాష్ట్రమైన ఏపీకి అడిగినన్నీ సైనిక్ స్కూళ్లను కేంద్రం మంజూరుచేస్తున్నది. ఇప్పటికే ఏపీలో కోరుకొండ, కలికిరి, కృష్ణపట్నంలో మూడు సైనిక్ స్కూళ్లుండగా, తాజాగా విజయవాడ సమీపంలోని కేతనకొండకు సైనిక్‌స్కూల్ మంజూరయ్యింది. దీంతో ఏపీలో సైనిక్ స్కూళ్ల సంఖ్య నాలుగుకు పెరిగింది. ఈ పదకొండేండ్లల్లో తెలంగాణకు ఒక్క కొత్త సైనిక్ స్కూల్‌ను కూడా కేటాయించలేదు. రాష్ట్రం నుంచి 8 మంది బీజేపీ ఎంపీలున్నా.. మోదీ మంత్రివర్గంలో ఇద్దరు కేంద్ర మంత్రులున్నా ఫలితం లేకుండా పోయిందని తల్లిదండ్రులు మండిపడుతున్నారు.

## ఇద్దరు పిల్లలను చంపి తండ్రి ఆత్మహత్య

కొండాపూర్, మే 5: భార్య ఇంటి నుంచి వెళ్లిపోవడంతో మనస్తాపం చెందిన ఓ వ్యక్తి ఇద్దరు పిల్లలను చంపి తానూ ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన సంగారెడ్డి జిల్లా కొండాపూర్ మండలం మల్కాపూర్‌లో శివారులో చోటుచేసుకున్నది. సీఐ వెంకటేశం కథనం ప్రకారం... కొండాపూర్ మం డలం గారకుర్తికి చెందిన బాయికాడి సుభాష్ (45)కు కొడుకు మరియన్ (7), కూతురు ఆరాధ్య (5) ఉన్నారు. సుభాష్ సదాశివపేట మండలం ఆత్మకూర్ పీహెచ్‌సీలో ల్యాబ్ టెక్నీషియన్‌గా పనిచేస్తున్నాడు. ఉద్యోగ రీత్యా మల్కాపూర్ చౌరస్తాలో నివాసం ఉంటున్నాడు. కుటుంబ కలహాలతో భార్య వారం క్రితం ఇంటి నుంచి వెళ్లిపోయింది. మనస్తాపం చెందిన సుభాష్ తన ఇద్దరు పిల్లలను బండ రాయితో కొట్టి చంపాడు. తర్వాత ఇతను ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు.